
సాక్షి ఒడిశా

బుధవారం, 20, సెప్టెంబర్, 2023




శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.4,61,009

బంగారం 450 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



మహానదిలో పడవ బోల్తా

మహానదిలో చేపల వేట పడవ ప్రమాదానికి గురయ్యింది. మా బనుళియి భరోసా అనే ఫిషింగ్ బోటు వేట నుంచి ఒడ్డుకు తిరిగి వస్తుండగా నెప్రాలా బంగ్లా సమీపంలో శక్తివంతమైన ఆటుపోట్లకు గురవ్వడంతో బోల్తా పడింది.

- 8లో



భారీగా గంజాయి పట్టివేత

రాష్ట్రంలోని రెండు వేర్వేరు చోట్ల ఎక్సైజ్ అధికారులు నిఘావేసి భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయిని సీజ్‌చేసి, నిందితులను అరెస్టు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

నదిలోకి కారు



నదిలో కారుపై ఉన్న బాధితుడు

భువనేశ్వర్: జగత్‌సింగ్‌పూర్ జిల్లా రెహమా ఖుసల్‌పూర్ గోళీ వంతెన సమీపంలో మహానదిలోకి బుధవారం కారు జారింది. దీంతో తిర్తోల్ అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని, డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని కాపాడారు. రక్షించబడిన యువకుల్లో జగత్‌సింగ్‌పూర్ జిల్లా ఢింకియా గ్రామానికి చెందిన రష్మీ రంజన్ స్వంయ్, కేంద్రాపడా జిల్లా పటకురా గ్రామానికి చెందిన పుష్పకాంత మహంతి ఉన్నారు. ఈ ఇద్దరి యువకుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్లు వైద్య వర్గాల సమాచారం.

బోల్తా పడిన గ్యాస్ సిలిండర్ లారీ



వంట గ్యాస్ సిలిండర్లతో బోల్తాపడిన లారీ

భువనేశ్వర్: వంట గ్యాస్ సిలిండర్ రవాణా చేస్తున్న లారీ బోల్తా పడింది. కటక్ శిఖర్‌పూర్ సమీపంలో గ్యాస్ ట్రక్కు ప్రమాదానికి గురైంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు.. హిందూస్థాన్ కంపెనీకి చెందిన వంట గ్యాస్ బండలు రవాణా చేస్తున్న ట్రక్కు ఓఎంపీ నుంచి జగత్‌పూర్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. శిఖర్‌పూర్ ఓవర్ బ్రిడ్జి దగ్గర రోడ్డు అధ్వానంగా ఉండడంతో లారీ బోల్తా పడింది. అయితే పోలీసులు వచ్చి గ్యాస్ సిలిండర్లు లీక్ అవుతున్నాయా లేదా అని తనిఖీ చేశారు. ఘటనా స్థలంలో గ్యాస్ లీకేజీ లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

లోకం చూడకుండానే..!



శిశువు మృతదేహం కనిపించిన ప్రదేశం

పర్లాకిమిడి: లోకం చూడకుండానే చిన్నారి తుదిశ్వాస విడిచిన ఘటన పర్లాకిమిడిలో వెలుగు చూసింది. స్థానిక 8వ వార్డు సన్నాయి నాయుడు వీధిలోని సూర్యా జ్యూయలర్స్ పెరటి సందులో సోమవారం ఒక నవజాత శిశువును పడవేసిన సంఘటన స్థానికుల్లో కలకలం రేపింది. అప్పుడే జన్మించిన మగ శిశువును సన్నాయినాయుడు సందులో గుర్తు తెలియని వ్యక్తులు విడిచిపెట్టారు. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే శిశువు మరణించినట్లు మున్సిపల్ స్వీపర్స్ గమనించారు. వెంటనే శిశువును ప్రభుత్వ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. ఎవరో రాత్రి వేళలో అక్కడ పడివేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దగ్గరలోని గజేంద్రవీధిలో ఒక ప్రైవేటు నర్సింగ్ హోం ఉంది. దీనిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఎదురెదురుగా వస్తున్న కారు, బస్సు ఢీ



ప్రమాద దృశ్యం

భువనేశ్వర్: పూరీ–కోణార్క్ డిఫెన్స్ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న బస్సు, కారు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందారు. అలాగే ప్రమాదంలో మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడంతో ఉన్నత చికిత్స కోసం కటక్‌కు ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన తర్వాత బస్సు అదుపు తప్పిడంతో బస్సులోనే డ్రైవర్ ఇరుక్కుపోయాడు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని బస్సులో ఉన్న డ్రైవర్‌ను రక్షించారు. కారులో 5 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదంలో మృతురాలు ఖుర్దా భింగార్‌పూర్‌కు చెందిన మణాలా మన్మయ్ దాస్‌గా గుర్తించారు. ఆమె ఉదయం పూరి నుంచి కోణార్క్‌కు కారులో వెళ్తున్నారు. ఇంతలో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో ప్రమాద బాధితులను రక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదంపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

శుభములివ్వు.. గణేశా..!

పార్వతీ తనయుడు.. ఏకదంతుడు.. బొజ్జ గణపయ్య భక్తులను ఆశీర్వదించేందుకు మండపాల్లో కొలువుదీరాడు. విఘ్నాలను తొలగించే లంబోధరుడు వాడవాడలా దర్శనమిచ్చాడు. వైవిధ్య ప్రతిమలు, మంత్రోచ్చరణల నడుమ అన్ని ప్రాంతాల్లో సందడి వాతావరణ నెలకొంది. కొన్నిచోట్ల వినాయక పెండాల్‌లు కొత్తగా సిద్ధంచేసి ఆకట్టుకున్నారు. పర్యావరణ ప్రేమికులు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: న్యూకాలనీలో పంచముఖ వినాయకుడు



పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యా మందిర్‌లో...



భువనేశ్వర్: కటక్‌లో పూజలందుకుంటున్న గణపయ్య




రాయగడ: చంద్రయాన్-3 నమూనా పెండాల్



మల్కన్‌గిరి: నక్కిటమ్మ మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన విగ్రహం



బరంపురం: కేదారేశ్వర్ ఆలయ నమూనా పెండాల్‌లో పూజలందుకుంటున్న వినాయకుడు




పర్లాకిమిడి సింకివీధిలో గణపతి ఉత్సవాలు



బరంపురం: మహావిష్ణు అవతారంలో ఆకట్టుకుంటున్న విఘ్నేశ్వరుడు



బరంపురం: మిలటరీ లైన్‌లో వినాయకుడికి పూజలు భక్తులు



బరంపురం: బెల్లిపూర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు

47 గ్రాముల బ్రౌన్ షుగర్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న గీతాంజలి సాహు



అరెస్టైన నిందితులు

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 47 గ్రాముల బ్రౌన్ షుగర్‌ను బరంపురం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారి గీతాంజలి సాహు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయం టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని బెల్లిపూర్ జంక్షన్‌లో ఆటోలో అక్రమంగా బ్రౌన్ షుగర్ తరలిస్తున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో పోలీసులు సంతోషిమాత ఆలయం దగ్గర రెక్కీ నిర్వహించి, వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానం కలిగిన ఆటోలో సోదాలు చేయగా 47 గ్రాముల బ్రౌన్ షుగర్ స్వాధీనం చేసుకొని ఆటోలో ఉన్నటువంటి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో గోపాల్‌పూర్‌కి చెందిన జితేంద్ర కుమార్ సాహు, బెల్లిపూర్‌కి చెందిన కౌసిక్ చంద్ర బెహరా ఉన్నట్లు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న బ్రౌన్ షుగర్ విలువ సుమారు రూ.6.44 లక్షలు ఉంటుందని వెల్లడించారు.

నిరసనకు తాత్కాలిక విరామం

భువనేశ్వర్: అఖిల ఉత్కళ ప్రాథమిక ఉపాధ్యాయుల యూనియన్ వివిధ డిమాండ్లతో దాదాపు వారం రోజులుగా నిరవధికంగా చేపట్టిన సమ్మెను వాయిదా వేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి చారులత మహాపాత్ర ఆందోళనను నిలిపివేసినట్లు తెలియజేశారు. ఉద్యమం కొనసాగుతున్నందున సమగ్రంగా ప్రాథమిక విద్యా వ్యవస్థ స్తంభించింది. ఈ నేపథ్యంలో ఉద్యమాన్ని నిలిపివేయాలని నిర్ణయించినట్లు వివరించారు. తక్షణమే వీరంతా విధులకు యథాతథంగా హాజరైనట్లు వెల్లడించారు. ప్రైమరీ టీచర్లకు కేంద్ర వేతనాలు, కళలు, క్రీడా రంగంలో అభ్యున్నతి విధానం అమలు, జూనియర్ టీచర్ల రెగ్యులరైజేషన్, మాస్ టీచర్ల ఎక్స్ కేడర్ రద్దు వంటి డిమాండ్లతో రాష్ట్రానికి చెందిన సుమారు 1,30,000 మంది ఉపాధ్యాయులు గత బుధవారం నుంచి ఆందోళనకు దిగారు. జిల్లా, మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాల ఎదుట సామూహిక సెలవుతో బైఠాయించిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక విద్యావ్యవస్థ స్తంభించిపోయింది. 30 లక్షల మందికి పైగా పిల్లల చదువులు దెబ్బతిన్నాయి. తమ డిమాండ్ల అమలు చేయడంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని సంఘం కోరింది. డిమాండ్లు నెరవేరే వరకు తలొగ్గేది లేదు. నడి రోడ్డు మీద బైఠాయించి పాఠశాలకు వెళ్లకుండా పిల్లలకు విద్యా బోధన ఇతరేతర విధులకు హాజరు కాబోమని ప్రభుత్వానికి హెచ్చరించారు. అఖిల ఉత్కళ ప్రాథమిక ఉపాధ్యాయుల యూనియన్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా సామూహిక సెలవుతో ఉపాధ్యాయులు వీధికి ఎక్కారు. ఈ తీరుపై విద్యాశాఖ కూడా ఘాటుగా స్పందించింది. పాఠశాలల్లో 220 రోజులు తరగతుల్లో విద్యా బోధన నిరవధికంగా జరగాల్సిందేనని హెచ్చరించింది. ఈ మేరకు సముచిత చర్యలు చేపట్టాలని డీఈవో, బీఈవోలకు లేఖ రాసింది.

జల దిగ్బంధం

- ప్రమాదకరంగా నదులు
- వరదలో వందలాది గ్రామాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు గంజాం, కొందమాల్ జిల్లాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. జిల్లావ్యాప్తంతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు కారణంగా నదులు పొంగి ఉగ్రరూపంతో ప్రవహిస్తున్నాయి. గంజాంలోని రుశికుల్యా నది, బెడో నదుల నుంచి వరద నీరు చేరడంతో అస్కా, కవిసూర్యనగర్, ఛత్రపూర్, గంజాం, కోదలా, కళ్లికోట్, బంజనగర్, హింజిలికాట్ మరియు జగన్నాథ్ ప్రసాద్ సమితిల్లోని వందలాది గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. అదేవిధంగా కొందమాల్ జిల్లాలో బగ్గువ, వైతరిణి నదుల్లో వరద నీరు చేరి కోట్‌గాడ్, శ్రీరామ్‌పూర్, రైకియా, జి.ఉదయగిరి, బల్లిగుడా బ్లాక్ పరిధుల్లో వందలాది ఆదివాసీ గ్రామాలు వరద నీటితో ముంచెత్తాయి. అలాగే రహదారులు కొట్టుకుపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఓడ్రాఫ్ బృందాలు వరద బాధితులకు సహాయం అందిస్తున్నాయి. – బరంపురం



బరంపురం: ఉధృతంగా ప్రవహిస్తున్న రుశికుల్యా నది



బరంపురం: వరద నీటిలో చిక్కుకున్న కటింగయా ఆదివాసీ గ్రామం



బరంపురం: బంజనగర్-కొందమాల్ మధ్య రహదారిపై ప్రవహిస్తున్న బైతరణి వరద నీరు



బరంపురం: అస్కా పట్టణంలో ముంచెత్తిన బొడొ నది వరద ముప్పు



బరంపురం: నగరంలో విపరీతంగా కురుస్తున్న కుండపోత వర్షం

క్లుప్తంగా

వందే భారత్ రెండో ట్రయల్ రన్ నేడు

భువనేశ్వర్: రాష్ట్రంలో రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించేందుకు రెండో ట్రయల్ రన్ బుధవారం నిర్వహించనున్నారు. ఈ నెలలో ఈ రైలు సేవలను పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టేందుకు రైల్వే శాఖ ఇటువంటి చర్యలను చురుకుగా చేపడుతోంది. పూరీ మరియు రౌర్కెలా మధ్య ఈనెల 20న బుధవారం రెండో ట్రయల్ రన్ షెడ్యూల్ ఖరారైంది. 20836 పూరీ – రౌర్కెలా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం ఉదయం 5 గంటలకు పూరీ రైల్వే స్టేషన్‌లో బయల్దేరి మధ్యాహ్నం 12.45 గంటలకు రౌర్కెలా చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సెమీ–హై–స్పీడ్ రైలు రౌర్కెలాలో మధ్యాహ్నం 2.10 గంటలకు బయల్దేరి రాత్రి 9.40 గంటలకు పూరీ చేరుకుంటుంది. ఈ రైలు ట్రయల్ రన్ పురస్కరించుకుని 505 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తుంది. ఈ సందర్భంగా రైలు వేగం గంటకు 63.33 కిలోమీటర్ల నుంచి 65.16 కిలోమీటర్ల సగటు వేగంతో పరుగులు తీస్తుంది. ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, ఢెంకనాల్, అంగుల్, కెరెజంగా, సంబల్‌పూర్ నగరం మరియు ఝార్సుగుడలో ఆగుతుంది.

చోరీ చేసింది బంధువే..!



చోరీకి గురైన బంగారు ఆభరణాలను విలేకరులకు చూపుతున్న పోలీసులు

నరసన్నపేట: మండలం కంబకాయలోని పాగోటి సావిత్రి ఇంటిలో ఆదివారం జరిగిన చోరీ కేసును నరసన్నపేట పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. చోరీకి గురైన బంగారు ఆభరణాలతో పాటు నగదును కూడా రికవరీ చేశారు. ఐటీఐ చదివి నరసన్నపేటలో జి కమ్యూనికేషన్ ఫైబర్ నెట్‌లో పనిచేస్తున్న తర్ర జానకిరావు (ఫిర్యాదు దారు చెల్లి కుమారుడు)ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సీఐ బూర ప్రసాదరావు తెలిపారు. ఆయన మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఆదివారం వేకువజామున చోరీ జరిగినట్లు సావిత్రి కుమారుడు రమేష్ ఫోన్‌లో సమాచారం ఇచ్చారని, వెంటనే స్పందించి సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. సంఘటన పరిశీలన తర్వాత కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన వివరాలు, చోరీ జరిగిన తీరు ఆధారంగా ఇంటిలోనే ఉన్న వ్యక్తులు ఈ చోరీకి పాల్పడి ఉంటారని భావించి ఆ దిశగా దర్యాప్తు చేశామని సీఐ తెలిపారు.

శనివారం రాత్రి 11 గంటల వరకూ చోరీ జరిగిన గదిలో కుటుంబ సభ్యులు ఉన్నారని, మళ్లీ ఆదివారం వేకువజామున 2 గంటల సమయంలో సావిత్రి చూస్తే బీరువా తెరిచి ఉండటం లాకర్‌లో ఉన్న బంగారు ఆభరణాలు కనిపించక పోవడాన్ని గమనించి ఇంట్లో వ్యక్తుల పనే అని భావించామన్నారు. వేలిముద్రలను సేకరించామని, డీఎస్పీ బాలచంద్రా రెడ్డి ఆదేశాలతో కుటుంబ సభ్యులను విచారణ చేయగా తర్ర జానకీరాంపై అనుమానం వచ్చి దర్యాప్తు చేస్తే అతను నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. చోరీకి పాల్పడిన జానకిరామ్ తల్లి మృతి చెందగా పెద్దమ్మ వద్దే ఉండి ఐటీఐ చదువుకున్నాడు. సొంత షాపు పెట్టుకోవడానికి పెట్టుబడి కోసం ఈ ఆభరణాలు దొంగతనం చేశానని అతను అంగీకరించాడని సీఐ తెలిపారు. చోరీకి గురైన పదకొండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 15 వేల నగదు రికవరీ చేసినట్లు తెలిపారు. కేసులో నరసన్నపేట ఎస్‌ఐ సింహాచలంతో పాటు సర్కిల్ ప్రత్యేక నిఘా సిబ్బంది ఏఎస్‌ఐ మస్తాన్, కానిస్టేబుల్ శ్రీనివాస్, నరసన్నపేట ఏఎస్‌ఐ అశిరి నాయుడు, సీసీఎఫ్ ఎస్‌ఐ రఫూల్‌లు చురుకైన పాత్ర పోషించి చోరీ సొత్తును రెండు రోజుల్లో రికవరీ చేశామన్నారు.

పండగ పూట విషాదం



భార్య కుమారుడితో మృతుడు రవి

జి.సిగడాం: పండగ పూట ఆ కుటుంబంలో విషాదం అలముకుంది. వినాయక చవితి వైభవంగా నిర్వహించుకుందామని భార్యకు చెప్పి ఆదివారం రాత్రి వెళ్లిన భర్త మార్గం మధ్యలో బైక్ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యారు. విశాఖలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేర కు ఆనందపురం పంచాయతీ ఆబోతులపేట గ్రామానికి చెందిన కీస రవి(27) వినాయక చవితి సామాన్లు కొనుగోలు చేయడానికి పొందూరు వెళ్లి తిరిగి ఆబోతులపేట గ్రామానికి వస్తుండగా.. ఆనందపురం, వాండ్రంగి గ్రామ సమీపంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద మరో బైక్ రవి బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో రవి తీవ్రంగా గాయపడ్డాడు. మరో నలుగురికి కూడా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని శ్రీకాకుళంలోని కిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి విశాఖ పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ రవి సోమవారం కన్నుమూశాడు. రవి వెనుక కూర్చున్న సోమరాజుల కృష్ణ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. అలాగే పొందూరుకు చెందిన స్వరూప సాయి, హరి సాయి, పేడాడ దామోదరరావు రాజాం కేర్‌లో చికిత్స తీసుకుంటున్నారు. మృతుడికి భార్య స్వామి, తొమ్మిది నెలల బాబు ఉన్నారు. పండగ వేళ ఇంతటి విషాదం జరగడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సామంతుల రామారావు తెలిపారు.

జై.. జై.. గణేశా..!



మల్కన్‌గిరి: వెత్నారీ వీధిలో పూజలందుకుంటున్న విఘ్నేషుడు



బరంపురం: అంకులి గ్రామంలో...



పర్లాకిమిడి: దోలా ట్యాంకు రోడ్డులో..



మల్కన్‌గిరి: మెయిన్ రోడ్డులో...



బరంపురం: పాంచమా పీఠం రావిచెట్టులో పూజలందుకుంటున్న గణేషుడు

రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడ చూసినా విద్యుత్ కాంతుల నడుమ గణనాథుని మండపాలు మెరిసిపోతున్నాయి. ప్రత్యేక ఆకృతులు, అలంకరణల్లో కొలువైన గణేశుని చూసి, తరించేందుకు భక్తజనం పోటీపడుతున్నారు. విశేష పూజలు చేస్తూ, తమపై కరుణాకటాక్షాలు చూపాలని వేడుకుంటున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: బుదరావలసలో...



బరంపురం: పాంచమా పీఠంలో దీపారాధన చేస్తున్న భక్తులు



రాయగడ: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముదులి



మల్కన్‌గిరి: సుభాష్ చంద్రబోస్ కూడలి వద్ద...



బరంపురం: అస్కా రోడ్‌లో...



బరంపురం: హౌసింగ్ బోర్డు కాలనీలో...



పర్లాకిమిడి: సాండివీధిలో...



రాయగడ: రైతుల కాలనీలో...

మహానదిలో పడవ బోల్తా



మహానదిలో బోల్తాపడిన పడవ

- ముగ్గురు గల్లంతు, ఐదుగురు సురక్షితం

భువనేశ్వర్: మహానదిలో చేపల వేట పడవ బోల్తాపడింది. మా బసుళెయి భరోసా అనే ఫిషింగ్ బోటు వేట నుంచి ఒడ్డుకు తిరిగి వస్తుండగా నెహ్రూ బంగ్లా సమీపంలో శక్తివంతమైన ఆటుపోట్లకు గురవ్వడంతో బోల్తా పడింది. పారాదీప్ నెహ్రూ బంగ్లా సమీప తీరంలో మంగళవారం సాయంత్రం వేళలో ఈ సంఘటన చోటు చేసుకుంది. దీంతో 8 మంది మత్స్యకారులు నదిలో చిక్కుకున్నట్లు సమాచారం. వీరంతా ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కోస్టు గార్డు దళం ప్రత్యక్షంగా సహాయక చర్యలు చేపడుతోంది. వీరితో అగ్ని మాపక దళం, అత్యవసర సేవా బలగాలు రంగంలో ఉన్నాయి. మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు.

మా బసుళెయి భరోసా – 2 పడవలో 8 మంది మత్స్యకారులు చేపల వేటకు బయల్దేరారు. పారాదీప్ తీరం మహానది నడిబొడ్డున చిక్కుకున్న మత్స్యకారుల గాలింపు చర్యల్లో 5 మందిని సురక్షితంగా తీరానికి చేర్చినట్లు రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయి తెలియజేశారు. మెరైన్ – కుజొంగొ అడిషనల్ ఫిషరీస్ ఆఫీసర్ ఈ మేరకు సమాచారం అందజేసినట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల గాలింపు, సహాయక చర్యలు నిరవధికంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఒడిశా సముద్ర చేపల ఉత్పత్తి సమాఖ్య మాట్లాడుతూ.. చిక్కుకున్న మత్స్యకారులను వెంటనే రక్షించాలని డిమాండ్ చేశారు. కోస్టు గార్డు వర్గాలు నదిలో చిక్కుకున్న మత్స్యకారుల్ని రక్షించేందుకు చర్యలు చేపడుతున్నారు. గల్లంతైన మత్స్యకారులకు సంబంధించి అధికారిక సమాచారం జారీ కావలసి ఉంది.

భారీగా గంజాయి పట్టివేత



రాయగడ: తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



మల్కన్‌గిరి: గంజాయితో పట్టుబడిన పికప్ వ్యాన్

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి ఒక బొలెరో పికప్ వ్యాన్‌లో తరలిస్తున్న గంజాయిని చేజ్‌చేసి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చిత్రకొండ పోలీసులకు బడపాదర్ పంచాయతీ రేఖపల్లి గ్రామం నుంచి గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో అర్ధరాత్రి ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఆంధ్రా వైపు వెళ్తున్న ఒక పికప్ వ్యాన్‌ను ఆపడానికి ప్రయత్నించారు. అయితే వాహనం ఆపకుండా వెళ్లడంతో వెంబడించారు. దీంతో నిందితులు వాహనాన్ని విడిచి పెట్టి పరారయ్యాడు. పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్‌లో ఉన్నటువంటి 9 కింటాళ్ల 80 కేజీల గంజాయిని సీజ్ చేశారు. గంజాయి విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

రాయగడ: కారులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఒక మహిళ, మరో ఇద్దరు యువకులను గుడారి పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం సాయంత్రం గుడారి కూడలిలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో గుమడా నుంచి గుడారి వైపు వెళ్లే కారును ఆపి సోదాలు చేపట్టగా, గంజాయి పట్టుబడింది. పట్టుబడిన గంజాయి 28.700 కిలోలుగా పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి రూ.420 నగదు, కారు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని, బుధవారం కోర్టుకు తరలించారు.

ప్రమాదాల నివారణకు మార్గదర్శకాలు

భువనేశ్వర్: గణేష్ పూజలను సురక్షితంగా మరియు ఆనందదాయకంగా జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూజా కమిటీలకు ప్రత్యేక సూచనలు జారీ చేసింది. గణేష్ పూజ కమిటీలు ఏర్పాటు చేసే పందిళ్లలో ముఖ్యంగా విద్యుత్ సంబంధిత ప్రమాదాలపై ప్రత్యేక జాగ్రత్త వహించాలని సూచించింది. ఈ విషయంలో భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని విద్యుత్ శాఖ తెలిపింది. పందిళ్ల ఏర్పాటు చేసేటప్పుడు ఓవర్ హెడ్ లైవ్ వైర్ల నుంచి సురక్షితమైన దూరాన్ని నిర్వహించాలని కమిటీలను కోరింది. ఈ విషయంలో ఆ శాఖ అధికారుల సహాయ, సహకారాలు, సలహాలను కమిటీలు తీసుకోవచ్చని అవకాశం కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో ప్రధానంగా భువనేశ్వర్, కటక్, రౌర్కెలా, సంబల్‌పూర్ మరియు బరంపురం వంటి ప్రధాన నగరాల్లో వందలాది పందిళ్లు ఏర్పాటు చేశారు. క్రమంగా సందర్శన రద్దీ పెరుగుతుంది. ఈ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహక కమిటీలు తప్పనిసరిగా చూసుకోవాలని విభాగం తెలిపింది. ఓవర్ హెడ్ విద్యుత్ తీగలు చాలా అధిక ఓల్టేజీని కలిగి ఉన్నాయని హెచ్చరిస్తూ, విద్యుత్ పోస్టుల నుంచి కనెక్షన్లు తీసుకునేటప్పుడు నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అవకతవకలు లేకుండా చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు పందిళ్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తారని ముందస్తుగా తెలియజేశారు, అవాంఛనీయ ప్రమాదాల నివారణ పురస్కరించుకుని సందర్శకులు, పూజా పందిళ్ల నిర్వాహకుల భద్రత నియమావళి అమలులో పూర్తి సహకారాన్ని అందజేయాలని విద్యుత్ విభాగం కోరింది.



ఖుర్దారోడ్ సీతారాం ఛక్ ప్రాంతంలో గణపతి పూజా పందిరి

కళింగపట్నం బీచ్‌లో యువకుడు గల్లంతు



కూన ప్రవీణ్ (ఫైల్)

గార,ఆమదాలవలస: కళింగపట్నం బీచ్‌లో ఆమదాలవలస సమీపంలోని కృష్ణాపురానికి చెందిన కూన ప్రవీణ్ (14) మంగళవారం సాయంత్రం గల్లంతైపోయాడు. ప్రవీణ్ తల్లి తల్లి ఉష, మరో బంధువుతో కలి సి మంగళవారం సాయంత్రం బీచ్‌కు వచ్చాడు. కాసేపు స్నానం కూడా చేశాడు. తర్వాత చే తులు కడుక్కుని వస్తానని చెప్పి తిరిగి రాలేదు. దీంతో నీటిలో పడిపోయి ఉంటాడని అంతా భావిస్తున్నారు.

వంశధార, సముద్రం సంగమ స్థలం కావడం, బురద నీరు ఉండడంతో యువకుడి ఆచూకీ దొరకలేదని పోలీసులంటున్నారు. మెరైన్ పోలీసు సిబ్బందికి సమాచారమివ్వగా గాలింపు చర్యలు చేపట్టారు. సీఐ ఎస్.కామేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టారు. అయి నా ఆచూకీ లభించకపోవడంతో అతడిడి తల్లి కన్నీరుమున్నీరయ్యారు. యువకుడి తండ్రి ప్రసాదరావు మూడేళ్ల కిందటే చనిపోయారు. అన్నయ్య కార్తీక్ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు.

ఘనంగా విశ్వకర్మ పూజలు



బరంపురం: సాత్‌కో కార్యాలయంలో పూజలందుకుంటున్న విశ్వకర్మ దేవుడు



బరంపురం: ఘాటీ కాలువ ప్రాంగణంతో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

బరంపురం: నగరంలోని వివిధ కూడళ్లలో విశ్వకర్మ పూజలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఇంజినీరింగ్ కళాశాల, ఐటీఐ, మోటార్ గ్యారేజీలు, ఆరోగ్య శాఖ కార్యాలయాలు, విద్యుత్ శాఖ, నీటి పారుదల శాఖలతో వివిధ కూడళ్లలో పూజలు చేపట్టారు. అదేవిధంగా రొంగాయిలొండా బ్లాక్ ఘాటి కాలువ ప్రాంగణంలో పంచముఖ విశ్వకర్మ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి.

జయపురం: నగరంలోని వివిధ సంస్థల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ పూజలు నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణ సంఘం సభ్యులు విశ్వకర్మ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. బెల్ రోడ్డులోని వీరబ్రహ్మం మందిరంలో విశ్వకర్మకు పూజలు జరిపారు. అలాగే పీహెచ్‌డీ కార్యాలయంలోనూ, జగజ్జననీ పిక్షన్ చాలక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పాల్గొన్నారు.

‘డిమాండ్లు పరిష్కరించకుంటే ఆమరణ దీక్ష’



నల్లబ్యాడ్జీలను ధరించి విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు

రాయగడ: తమ న్యాయమైన ఐదు డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈనెల 25 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని సబ్‌జైల్ ఉద్యోగులు హెచ్చరించారు. ఆల్ ఒడిశా జైల్ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు స్థానిక సబ్ జైల్ ఉద్యోగులు గత వారం నుంచి నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేదంటే నిరహార దీక్ష అనివార్యమని రాయగడ సబ్‌జైల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సింహాచల్ సాహు మంగళవారం తెలియజేశారు. జైలు వార్డు పే రూ.2000, సీనియర్ ఉద్యోగులకు పదోన్నతి, అదేవిధంగా నూతన వేతన కమిషన్ –2017 అనుసారం 13 నెలల వేతనాన్ని చెల్లించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి బేజగూడ పంచాయతీ కొత్తమేట గ్రామం వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. గంగులు గ్రామానికి చెందిన డొంబురు కోపే (38), తన స్నేహితుడి మంగులుతో కలిసి గణపతి విగ్రహం కొనడానికి మత్తిలి వైపు వస్తున్నారు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న వ్యాన్ వారిని ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే డొంబురు మృతి చెందగా, మంగులుకు తీవ్ర గాయలయ్యాయి. వెంటనే స్థానికులు మంగులును మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని డొంబురు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విషయం తెలిసిన గంగులు గ్రామస్తులు ఆయా కుటుంబాలకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు వారికి సర్ది చెప్పి ధర్నా విరమించేలా చర్యలు తీసుకున్నారు.



ప్రమాద స్థలంలో డొంబురు మృతదేహం

క్లుప్తంగా

వాటర్ ప్లాంట్‌లపై కేసులు



వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న ఆహార తనిఖీ అధికారి వెంకటరమణ

మెంటాడ(గజపతినగరం రూరల్): నిబంధనలను అతిక్రమించి నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్‌లపై కేసులు నమోదు చేయడం జరిగిందని జిల్లా ఆహార తనిఖీ అధికారి ఈశ్వరి అన్నారు. మంగళవారం తన సిబ్బందితో కలసి గజపతి నగరం పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికులు ఫిర్యాదు మేరకు నగరంలోని లక్కీడ్రాప్, ప్రవల్లిక అనే వాటర్ ప్లాంట్‌లను తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఈ రెండు కేంద్రాలు నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించడం జరుగుతుందని గుర్తించి కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ నగరంలో పలు హోటళ్లు, అల్పాహార దుకాణాలు, జ్యూస్ పార్లర్‌లు, అలాగే పాల పదార్థాల విక్రయ కేంద్రాలు, మిఠాయి దుకాణాలతో పాటు ఆహారాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు అందించే ప్రతీ కేంద్రం కూడా నిబంధనలు పాటించి విక్రయాలు జరపాలన్నారు. లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఆమెతో పాటు గజపతినగరం క్లస్టర్ సిబ్బంది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అరకు-విశాఖ రోడ్డులో ప్రమాదం



లారీ వెనుక భాగంలో ఢీకొట్టిన బైక్

కొత్తవలస: మండలంలోని అరకు - విశాఖ రోడ్డులో అప్పన్నపాలెం గ్రామం సమీపంలో గల తాటిపూడి రిజర్వాయర్ పంప్‌హౌస్ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో లక్కవరపుకోట గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా వున్నాయి. గణేష్ తన ద్విచక్ర వాహనంపై ఎల్.కోట నుంచి కొత్తవలస వైపు వెళ్తుండగా ముందర వెళ్తున్న లారీ ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేసాడు. దీంతో గమనించని గణేష్ తన వాహనంతో లారీ వెనుక భాగంలో ఢీకొట్టాడు. తీవ్ర గాయాల పాలైన గణేష్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

లారీ బోల్తా



బంగారమ్మపేట వద్ద బోల్తా పడిన లారీ

కొమరాడ: మండలంలోని బంగారమ్మపేట గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై మంగళవారం రాయఘడ నుంచి పార్వతీపురం వైపు వస్తున్న లారీ గొయ్యిను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహన రాకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగానే ఉన్నారు.

అల్యూమినియం లోడు లారీ బోల్తా...



బోల్తా పడ్డ భారీ వాహనం

బొబ్బిలి: మండలంలోని పారాది, గొర్లె సీతారాంపురం మధ్య డౌన్‌లో మంగళవారం వేకువ జామున భారీ వాహనం బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి అల్యూమినియం లోడుతో ఝూర్సిగుడా వెళ్తోందని వాహన డ్రైవర్, సిబ్బంది తెలిపారు. భారీ వాహనం బోల్తా పడటంతో ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా ఏఎస్‌ఐ కొండలరావు, ట్రాఫిక్ సిబ్బందిని తీసుకువెళ్లి లైన్ క్లియర్ చేశారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో చదువుతున్న తరుణ తేజ, చైతన్య, గిరీష్ కుమార్, హేమంత్ కుమార్, రామాంజనేయ, నాగభరత్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పతివాడ శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 21 నుంచి విజయవాడలో జరగనున్న పోటీల్లో వీరంతా పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

పరామర్శకు వెళ్తూ...
మృత్యు ఒడిలోకి...

- ఆటో బోల్తా : ఇద్దరి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ముగ్గురికి స్వల్ప గాయాలు



ప్రమాద స్థలంలో శ్రీనివాసరావు

గంట్యాడ: బంధువుల ఇంటికి పరామర్శకు బయలుదేరి మృత్యు ఒడిలోకి చేరిన విషాద ఘటన ఇది. బంధువుల ఇంటికి వెళ్లేలోపే ఆటో బోల్తా పడి ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన కొందరు సోమవారం మురపాక గ్రామంలో తమ బంధువు ఒకరు మృతి చెందడంతో పరామర్శకని ఆటోలో బయలుదేరి వెళ్లారు. మురపాక గ్రామ సమీపంలో ఉన్న కోనేరు వద్దకు వచ్చేసరికి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సిరపురపు సత్యం(60), పొట్నూరు శ్రీనివాసరావు(53), పొటుపురెడ్డి కొండమ్మ, పొటుపురెడ్డి సత్యవతికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యం, శ్రీనివాసరావు మృతి చెందారు. కొండమ్మ, సత్యవతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరితో పాటు మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.



శ్రీనివాసరావు (ఫైల్)



సత్యం(ఫైల్)

మృతుడు శ్రీనివాసరావుకు ఇద్దరు కుమార్తెలు కాగా.. వారిలో పెద్ద కుమార్తెకు వివాహమైంది. రెండో కుమార్తెకు ఇటీవల వివాహం నిశ్చమైంది. ఈ తరుణంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసెలా రోదిస్తున్నారు. ఆటో డ్రైవర్ సిరపురపు వినోద్ నిర్లక్ష్యంగా.. అతి వేగంగా ఆటోను నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



నాగేంద్రకుమార్(ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మరడాం గ్రామానికి చెందిన తాడి నాగేంద్రకుమార్(24) మృతి చెందినట్లు ఎస్ భూర్జవలస హెచ్‌సీ బెడ్సన్ తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద స్నేహితులతో సరదాగా గడిపిన అనంతరం రాత్రి 9 గంటల సమయంలో మర్రివలసలో స్నేహితుడిని దింపడానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా వెనుక నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు చెల్లెళ్లు ఉండగా తల్లి గ్రామంలో ఆశా కార్యకర్తగా, తండ్రి ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. మృతుడు తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకునికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరమణ్యకుమార్ భూషణ్

పార్వతీపురం టౌన్: బెంగళూరు నుండి టాటానగర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు నుండి జారిపడి యువకునికి తీవ్ర గాయాలైన సంఘటన పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. బెంగళూరు నుండి టాటానగర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న జార్ఖండ్ రాష్ట్రం పాలము జిల్లా కుర్వాట్ పోస్టు కువా ఖోహ్ గ్రామానికి చెందిన వీరమణ్యకుమార్ భూషణ్ పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్ వద్దకు వచ్చేసరికి రైలు నుండి జారిపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్సను అందించారు. వివరాలను నమోదు చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రత్నకుమార్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యాన్ డ్రైవర్‌కు..



గాయపడిన ఇళ్లా రఘు

పార్వతీపురం టౌన్: లారీ ఢీకొనడంతో వ్యాన్ డ్రైవర్‌కు గాయాలైన సంఘటన మంగళవారం పార్వతీపురం పట్టణంలో చోటు చేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పార్వతీపురం పట్టణం కొత్తవలస నందమూరి కాలనీకి చెందిన ఇళ్లా రఘు వ్యాన్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం తన వ్యాన్‌ను కొత్తవలస నుండి ఎస్ఆర్ పేటకు స్కూల్ పిల్లలను తీసుకొని రావడానికి వెళ్తుండగా మార్గమధ్యంలో రైల్వే ఫ్లెటైవర్ బ్రిడ్జి నుంచి బైపాస్ రోడ్డు లారీ యూనియన్ ఆఫీస్ వద్ద మెయిన్ రోడ్డుపై వ్యాను వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రఘుకు గాయాలయ్యాయి. వ్యాన్ ముందు భాగం నుజ్జయ్యింది. గాయపడిన అతడ్ని లారీ డ్రైవర్ 108 వాహనానికి కాల్ చేసి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలపై అవుట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డుపై తీవ్ర గాయాలతో శ్రీకాంత్

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన గొండేల శ్రీకాంత్, తేజ అనే ఇద్దరు వ్యక్తులు మంగళవారం సాయంత్రం కోమటి పల్లి వెళ్తున్నారు. మార్గ మధ్యంలో ఉన్న రైస్‌మిల్లు సమీపాన ఉన్న మలుపు వద్ద ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న స్కూటీకి తగిలి పడిపోయారు. ఈ సమయంలో శ్రీకాంత్ కాళ్ల మీదుగా వెనుక చక్రం వెళ్లిపోయింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి విజయనగరం కేంద్రాస్పత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించినట్టు ఏఎస్ఐ బీవీ రమణ తెలిపారు. ఇతనితో పాటు ప్రయాణిస్తున్న తేజ ఆచూకీ కానరాలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

గంట్యాడ: పాము కాటుతో ఓ మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పెదమజ్జిపాలేం గ్రామానికి చెందిన పైల అంజలి(28) సోమవారం ఇంటి ఆవరణంలో కరివేపాకు కోయడానికి వెళ్లగా అక్కడ పాము కాటు వేసింది. దీంతో వారి కుటుంబ సభ్యులు గ్రామంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ ఎస్‌వీ రమణమూర్తి తెలిపారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



జిల్లా స్థాయికి ఎంపికైన వాలీబాల్ టీంతో మండల కోఆర్డినేటర్ నాగన్న

భోగాపురం: మండలం కేంద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మండల కోఆర్డినేటర్ నాగన్న ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో వాలీబాల్, షటిల్ పోటీల్లో పలువురు క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభ చాటారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల పోటీలు కొనసాగాయి. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన టీంలను జిల్లా స్థాయికి పంపిచనున్నట్లు నాగన్న తెలిపారు.

నేడే ప్రారంభోత్సవం

పూసపాటిరేగ: మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఈ నెల 20న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రాధిక మంగళవారం తెలిపారు. పూసపాటిరేగలో గ్రామసచివాలయం-2, సీహెచ్ అగ్రహారంలో వెల్నెస్ కేంద్రం, చౌడువాడ వెల్నెస్ కేంద్రం, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్, బరిణికాంలో సీసీరోడ్డు, గోవిందపురం రైతుభరోసా కేంద్రంను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

టీచర్ల వేతనాలకు తొలగిన అడ్డంకులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాల చెల్లింపుల్లో ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టుల మదింపు (కేడర్ స్ట్రెంగ్త్) పూర్తి చేసిన విద్యాశాఖాధికారులు ఆయా పోస్టుల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించడంతో ఎదురైన సాంకేతిక ఇబ్బందులకు పరిష్కారం చూపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఎంఈఓ-2 పోస్టుల భర్తీ నేపథ్యంలో ఖాళీ అయిన హెచ్ఎం (వేతన డ్రాయింగ్ అధికారి) స్థానంలో డ్రాయింగ్ అధికారుల ప్రక్రియ జరగకపోవడం వల్ల ఆయా హెచ్ఎంల పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ టీచర్ల వేతనాలు, ఎంఈఓ-1, ఎంఈఓ-2 పోస్టుల్లోకి కొత్తగా అధికారుల రాక, వేతనాలు చెల్లించే డ్రాయింగ్ అధికారుల బదలాయింపు ప్రక్రియలో ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించడంలో కొంత జాప్యం కలిగింది. ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన విద్యా శాఖ ఉన్నతాధికారులు మండలాల వారీగా ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

లక్ష్యాలను చేరుకోకపోతే చర్యలు తప్పవు

- ప్రగతి సమీక్షలో మండల స్థాయి అధికారులపై కలెక్టర్ నాగలక్ష్మి సీరియస్
- ఆరోగ్యసురక్ష సర్వే మరింత వేగవంతం కావాలని ఆదేశాలు

విజయనగరం అర్బన్: అభివృద్ధి పనులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోయినా కఠిన చర్యలు తప్పవని మున్సిపల్, మండల స్థాయి అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ హెచ్చరించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మంగళవారం జేసీ కె.మయూర్ అశోక్, ప్రత్యేక అధికారులతో కలసి ఆమె అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షించారు. ప్రధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, ఇళ్ల నిర్మాణాలు, ప్రభుత్వ భవన నిర్మాణాలు ఇతర పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె పలు అంశాలపై మార్గ నిర్దేశకాలు జారీ చేశారు. లక్ష్యాలను చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మరింత వేగవంతం చేయాలని, ప్రతి కుటుంబం నుంచి సేకరించిన వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతంలో అయితే 20 రోజుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 15 రోజుల్లోగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని చెప్పారు. భవిష్యత్తులో ఇవే వివరాల ఆధారంగా వైద్య చికిత్సలు ఉంటాయి కాబట్టి సర్వే విషయంలో అందరూ సీరియస్‌గా వ్యవహరించాలని పేర్కొన్నారు. రోజూ 40 కుటుంబాల వివరాలను సేకరించాలని స్పష్టం చేసారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. భౌతికంగా కంప్లీట్ అయిన ప్రభుత్వ భవనాలను అక్టోబర్ నెలాఖరు నాటికి అప్పగించాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో చేపట్టిన నిర్మాణాల పూర్తికి ప్రతి ఒక్కరూ సమష్టి కృషి చేయాలని చెప్పారు. డిసెంబర్ నాటికి ఎట్టి పరిస్థితుల్లో శతశాతం నిర్మాణాలు పూర్తి కావాల్సిందే అని పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా నమోదవుతున్న ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జేసీ మయూర్ అశోక్

వంగర ఎంపీడీఓపై సీరియస్

ముందస్తు సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్లిన ఎంపీడీఓపై కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ సీరియస్ అయ్యారు. వీసీలో భాగంగా ఆయన్ని పిలవవగానే రెస్పాండ్ కాలేదు. ఈఓపీఆర్‌డీ రెస్పాండ్ అయి సెలవు పెట్టారని చెప్పగా... ఎవరికి చెప్పి సెలవు పెట్టారని ఘాటుగా స్పందించారు. వెంటనే వచ్చి జడ్పీ సీఈఓని తనని కలవాలని ఆదేశించారు. జేసీ కే.మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్లు వెంకటేశ్వరరావు, సుదర్శన దొర, పద్మలత, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

వాసవీనగర్‌లో భారీ చోరీ

- సుమారు 29 తులాల బంగారు ఆభరణాలు, రూ.2.50లక్షల నగదు చోరీ
- ఉలిక్కిపడిన కాలనీవాసులు



ఘటనా స్థలం వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

రాజాం సిటీ: పట్టణ పరిధి వాసవీనగర్‌లో సోమవారం రాత్రి భారీ చోరీ జరగడంతో కాలనీ వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కాలనీలో నివాసం ఉంటున్న గొద్దు వెంకటరమణ వినాయక చవితి పండగ కోసం స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం ఎందువ గ్రామానికి కుటుంబ సభ్యులతో కలసి వెళ్లాడు. యథావిధిగా మంగళవారం ఉదయం వాసవీనగర్‌లో ఉన్న తన ఇంటికి వచ్చి చూసేసరికి సందులోని గ్రిల్స్‌కు వేసిన తాళం తీసి ఉండడంతో ఆందోళన చెంది ఇంట్లోకి వెళ్లి చూశారు. ఇంట్లోని బీరువాలు కూడా తెరిచి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ కె.రవికుమార్‌తో పాటు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసిన సీసీ పుటేజీలను తనిఖీ చేశారు. అనంతరం క్లూస్‌టీంకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. సుమారు 29 తులాల బంగారంతో పాటు రూ.2.50లక్షల నగదు చోరీకి గురైనట్లు బాధితులు లబోదిబోమంటున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. పట్టణంలో గస్తీ ముమ్మరం చేయనున్నామని, ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో తమకు తెలియజేయాలని సూచించారు. అలాగే ఇళ్లల్లో పెద్ద మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు ఉంచకుండా జాగ్రత్తపడాలని సూచించారు.

తాళాం వేసిన ఇళ్లే లక్ష్యంగా...

పట్టణంలో జరుగుతున్న దొంగతనాలు తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి వాసవీనగర్‌లో ఉపాధ్యాయులు వెంకటరమణ కుటుంబ సభ్యులు స్వగ్రామం వెళ్లిపోవడం గమనించి దొంగతనానికి పాల్పడ్డారు. అలాగే రెండు నెలల క్రితం బొబ్బిలి రోడ్డులోని ఫైర్ స్టేషన్ సమీపంలో ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించి అర్ధరాత్రి సమయంలో దొంగలు చొరబడిన విషయం విదితమే. ఈ ఘటనలో కూడా ఆరు తులాల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఇలా మరిపించి దొంగతనాలకు పాల్పడడంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రి గస్తీ మరింత ము మ్మరం చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన జన్ని ప్రసాద్

పార్వతీపురం టౌన్: గడ్డి మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం పార్వతీపురం మండలంలో చోటు చేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మండలం శివన్నదొరవలస గ్రామానికి చెందిన జన్ని ప్రసాద్ (25) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో వరహాల గెడ్డ డ్యాం దగ్గర గడ్డి మందు తాగి అక్కడి చింత చెట్టు కింద పడి ఉన్నాడు. డ్యాం దగ్గర చేపలు పడుతున్న వరసకు బావలైన పాలక త్రినాథ్, శంకర్రావులు చింత చెట్టు కింద పడి ఉన్న ప్రసాద్‌ను గమనించి విషయం అడగగా జరిగిన విషయం చెప్పడంతో వెంటనే బైకుపైన పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమించంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య



సోములు మృతదేహం

బాడంగి: మద్యానికి బానిసైన తనను వదిలేసి వెళ్లిన భార్య ఎంత పిలిచినా తిరిగి ఇంటికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన రేగు సోములు(50) మద్యానికి బానిసై కుటుంబ వివాదాల నడుమ సోమవారం మధ్యాహ్నం గడ్డి మందు తాగాడు. గుర్తించిన బంధువులు స్థానిక సీహెచ్‌సీకి 108 వాహనంలో తరలించారు. అక్కడ వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించగా అక్కడ మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆర్.జయంతి చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు తెలిపారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

- జేసీ గోవిందరావు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురం: జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ధాన్యం సేకరణకు గోనె బస్తాలను ముందస్తుగా సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ అన్నారు. అక్టోబరు నెలాఖరు నాటికి ఒక కోటి గోనె బస్తాలను సిద్ధం చేయాలని, అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని, సిబ్బంది నియామకం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. యాప్‌ల వినియోగంలో సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆయన ఆదేశించారు. కూలీలు, రవాణాకు కార్యాచరణ ప్రణాళిక ఉండాలని ఆయనన్నారు. చెల్లింపుల యాప్‌లో నమోదు చేయాల్సిన వాహనాల వివరాలు సేకరించి ముందుగా నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. బ్యాంక్ గ్యారంటీ నిర్దేశిత సమయంలో ఇవ్వాలని ఆయన సూచించారు. మిల్లర్లు, రవాణా, గోనె సంచులు, బ్యాంక్ గ్యారంటీ, ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేల్స్ తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు.

22న రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం

రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని ఆయనన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతు కల్లం నుండి లేదా నిర్దేశిత ప్రదేశం నుండి యాధృచ్ఛికంగా ఎంపిక చేసిన మిల్లులకు పంపడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ధాన్యం రవాణా చేయుటకు ముందుకు వచ్చిన రవాణా కాంట్రాక్టర్లు వాహనానికి జీపీఎస్‌ను సొంతంగా అమర్చాలని ఆయన చెప్పారు. రవాణా కాంట్రాక్టర్లతో ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల రవాణా కాంట్రాక్టర్లు ఈ నెల 15వ తేదీ నాటికి పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎమ్.దేవుళ నాయక్, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఎల్.అశోక్ కుమార్, సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ ఆర్.రమణ మూర్తి, జీసీసీడీఎం వి.మహేంద్ర కుమార్, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు కొత్త కోట రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఉదయ భా ను, తదితరులు పాల్గొన్నారు.

డయేరియా విజృంభణ



దెంకాడ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న పినతాడివాడ డయేరియా వ్యాధిగ్రస్తులు



పినతాడివాడలో వైద్య సేవలపై డాక్టర్ పావని వద్ద వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

దెంకాడ: మండలంలోని పినతాడివాడ, గుణుపూరు గ్రామాల్లో డయేరియా విజృంభిస్తోంది. గొడిపాలెం గ్రామంలో ఇటీవల డయేరియాతో ఒకరు మృతి చెందగా..పలువురు ఆస్పత్రి పాలయ్యారు. ఇది మరువకముందే పినతాడివాడ, గుణుపూరులో డయేరియా కేసులు పెరుగుతున్నాయి. ఒక్క రోజు వ్యవధిలోనే 20 మంది వ్యాధి బారిన పడ్డారు. వారిలో ఒకరు మరణించారు. గ్రామంలో వైద్యాధికారులు పర్యటించి బాధితులకు వైద్య సేవలందిస్తున్నారు. పలువురిని దెంకాడ పీహెచ్‌సీకి, జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నట్లు డాక్టర్ పావని తెలిపారు. కలుషిత నీరు కారణంగానే వాధి ప్రబలి ఉంటుందని అనుమానిస్తున్నారు. గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకులతో పాటు డి.కొల్లాం వద్ద ఉన్న తాగునీటి ప్రాజెక్టు నుంచి గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోంది. దీంతో ఎక్కడైనా లీకేజీల కారణంగా నీరు కలుషితమౌతోందా అనే అనుమానాలు ఉన్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించారు. రక్షిత మంచినీటి ట్యాంకులను గ్రామ అధికారులు క్లోరినేషన్ చేయించారు. వ్యాధి నివారణకు తగు చర్యలు తీసుకుంటున్న అధికారులు తెలిపారు.

డీఎంహెచ్‌ఓ పరిశీలన

పినతాడివాడలో వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి భాస్కరరావు సందర్శించారు. గ్రామంలో ఎంత మంది వ్యాధి బారిన పడ్డారు, వారు ఎక్కడెక్కడ వైద్య సేవలు పొందుతున్నారు, ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. వైద్య అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుని వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.